క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రరాజేశ్వర్

లింగంపేట: తహసీల్దార్‌గా చంద్రరాజేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వరకు తహసీల్దార్‌గా పని చేసిన మారుతి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రరాజేశ్వర్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా తహసీల్దార్‌ను వీఆర్ఏలు,సిబ్బంది సన్మానించారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన



భిక్కనూరు: డ్రోన్ ద్వారా పొలాలకు పురుగుల మందు పిచికారిపై మండల కేంద్రంలోని మోటాట్‌పల్లి గ్రామంలో రిలయన్స్ పౌండేషన్ ప్రతినిధులు బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్‌తో ఎకరాంకు మందు పిచికారి చేస్తే కేవలం రూ. 600 మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు రంజిత్, భూపతి, ఏఈవో అఖిలేష, సర్పంచ్ రాజేశ్వరి రాజిరెడ్డి, రైతులు యాదవరెడ్డి, భూమయ్య, గోపాలరెడ్డి, రాజయ్య, రాములు పాల్గొన్నారు.

బోరు మోటార్ పంపు ప్రారంభం



భిక్కనూరు: మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామి ఆలయం వద్ద మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటర్ పంపును ఎంపీపీ గాలిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎంతో ఉపయోగపడుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, ఎంపీటీసీ సభ్యులు సరస్వతి, సువర్ణ ప్రభాకర్, బాబు, శ్రీసిద్ధ రామేశ్వరాలయం పునర్ నిర్మాణకమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, నాయకులు నాగభూషణంగౌడ్,బల్యాల సిద్దరాములు,పబ్బ సిద్దేశ్,మల్లేషం,శ్రీధర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు..



రాజంపేట: మండల కేంద్రమైన రాజంపేటలో రూ. 51 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ఆముద సామ్య బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండహన్మండ్లు, వైస్ ఎంపీపీ సావిత్రి, పీఏసీఎస్ చైర్మన్ నల్లవెల్లి అశోక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బల్వంతరావ్, రైతు బంధు కన్వినర్ మోహన్‌రెడ్డి, మాజీఎంపీపీ నీరడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై చిన్న చూపు తగదు



తాడ్వాయి: బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూడటం తగదని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సాయిబాబా పేర్కొన్నారు. తాడ్వాయిలో బుధవారం బీసీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆ యన మాట్లాడుతూ 54 శాతం ఉన్న బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమే కెటాయించడం సిగ్గుచేటు అన్నారు.

చెక్కుల పంపిణీ



పెద్దకొడప్‌గల్: నిరుపేద కుటుంబలకు కల్యాణ లక్ష్మీ వరంగా నిలుస్తుందని మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడు తిర్మల్‌రెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ దశరథ్‌తో కలిసి ఆయన పలువురి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు.

పిట్లం: కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరంలాంటివి అని ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 42 మంది లబ్ధిదారులకు వారు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, సహకార సంఘం చైర్మన్ శప్దంరెడ్డి, పిట్లం సర్పంచ్ జొన్న విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలు.. ఎండుతున్న పంటలు

- సకాలంలో నీరు అందక నెర్రలుబారుతున్న వరి పొలాలు
- ఆందోళనలో రైతన్నలు


మహమ్మద్‌నగర్ శివారులో నీళ్లు లేక నెర్రలు బారుతున్న వరి పొలం

నిజాంసాగర్: కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో వ్యవసాయ బోరు బావుల కింద సాగు చేసి వరి పంటకు సాగు నీరు సరిగా అందక పొలాలు నెర్రలుబారుతున్నాయి. అప్రకటిత కరెంట్ కోతలతో బోరుబావులు, లిఫ్టుల నుంచి నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పొలాలకు సరైన సమయంలో నీళ్లు అందకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1.50 లక్షల వ్యవసాయ బోరుబావులు, లిఫ్టుల కింద పంటలు సాగు చేస్తున్నారు. యాసంగి పంటల సాగుకు రోజూ పగటి వేళల్లో 12 గంటల పాటు నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేశారు. దాంతో బోరుబావులు, లిఫ్టుల కింద పంటల సాగు విస్తీర్ణం ఆశాజనకంగా మారింది. ఇరవై రోజుల నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తుండటంతో పంట పొలాలకు నీరు అందడం లేదు. అప్రకటిత కరెంట్ కోతల వల్ల తడిచిన మడి నీరు తడుస్తుండగా చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక పొలాలు నెర్రలు బారుతున్నాయి. వ్యవసాయ రంగానికి అర్ధరాత్రి వేళల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తుండటంతో చిమ్మచీకట్లో పంట పొలాలకు వెళ్లడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. రాత్రి కరెంట్‌తో రైతులు పంట పొలాలకు వెళ్ల లేకపోతున్నారు. పగటి పూట నాలుగైదు గంటలు పాటు త్రీఫేజ్ కరెంట్ ఇస్తుండటంతో పంట పొలాలకు నీళ్లు సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. మూడు షిఫ్టుల్లో కరెంట్ సరఫరా, అప్రకటిత కోతలతో బోరు బావులు, లిఫ్టులు కాలుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా పగలు 12 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులను రైతులు కోరుతున్నారు.

జూనియర్ కళాశాల కలేనా?

- డబ్బులు డిపాజిట్ చేసినా ఫలితం శూన్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం కేటాయించిన అదనపు గదులు

నిజాంసాగర్: జూనియర్ కళాశాల ఏర్పాటు కలగా మారింది. ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని పాలకులు హామీ ఇచ్చినా వాటి గురించి పట్టించుకోవడం లేదు. పదో తరగతి పూర్తయ్యాక ఇంటర్ చదవాలంటే పక్క మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నిజాంసాగర్ మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైనట్లు మూడేళ్ల కిందటే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను జూనియర్ కళాశాల కోసం కేటాయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడంతో అప్పట్లో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్‌సలాం గదులను పరిశీలించి పర్నీచర్, ల్యాబ్, మౌలిక వసతుల కల్పనకు డబ్బులు డిపాజిట్ చేయాలని సూచించడంతో ప్రతి గ్రామ పంచాయతీ నుంచి రూ. 20 వేల చొప్పున రూ. 3.12 లక్షల వరకు విరాళాలు ఇచ్చారు. ఈ మొత్తాన్ని అప్పట్లో కంట్రిబ్యూషన్ కింద ఇంటర్ బోర్డుకు చెల్లించారు. కంట్రిబ్యూషన్ చెల్లించి మూడేళ్లు గడస్తున్నా జూనియర్ కళాశాల జాడ కన్పించడం లేదు. నిజాంసాగర్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో చేసేది ఏమీలేక విద్యార్థులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రయివేట్ కళాశాలల్లో చేరుతున్నారు. నిజాంసాగర్, బీర్కూర్ పాత మండలాలతో పాటు కొత్తగా ఏర్పాటైన మండలాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని నోడల్ అధికారి షేక్‌సలాం వెల్లడించారు.

క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి


మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కామారెడ్డి అర్బన్: మహిళలు మూడేళ్లకు ఒకసారి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థలు, తెలంగాణ మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి అయ్యప్పనగర్‌లోని సత్యసాయి సేవాసదనం వద్ద ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఎన్‌జే ఆస్పత్రి డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన మహిళలు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రసాద్, సత్యసాయి రాష్ట్ర మహిళా విభాగం సమన్వయకర్త గీతాపావని, జిల్లా ఇంచార్జి భాస్కర్‌రావు, ప్రతినిధులు భాస్కర్ శర్మ, వెంకటేశ్వర్, కృష్ణకుమారి, లింబాద్రి, వైద్యులు ప్రత్యూష్య, శివప్రసాద్‌రెడ్డి, శివసూర్య తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో ప్రభుత్వ విప్‌కు ఘన స్వాగతం



భిక్కనూరు: ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు అమెరికాలో బుధవారం మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మల్లేషు మల్లికార్జున్‌రెడ్డితో పాటు పలువురు ఎన్ఆర్ఐలు ఘనస్వాగతం పలికారు. అమెరికాలో నివసిస్తున్న కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన ఎన్ఆర్ఐలతో విప్ సమావేశం కానున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మద్నూర్: శనగ, ధనియా, కందికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు చాట్లావార్ గోపాల్, మహజన స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బాలు యాదవ్ రైతులతో కలిసి బుధవారం వేర్వేరుగా తహసీల్దార్ అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు సంజయ్, మానిక్, రాజు, సాయి, అనిల్, మారుతి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో శనగ కొనుగోలు కేంద్రాలు

సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్: శనగ కొనుగోలు కేంద్రాలను వారం రోజుల్లో ప్రారంభించి మద్దతు ధర కల్పిస్తామని బిచ్కుంద వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్‌కుమార్ పేర్కొన్నారు. సాక్షి దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన 'మద్దతు ధర సరే.. కొనేదెప్పుడో' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన రైతుబంధు సమన్వయ సమితి క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 5,330తో కొనుగోలు చేస్తామని రైతులు తొందరపడి దళారులకు విక్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు దిగంబర్‌పటేల్, ఆత్మ కమిటీ చైర్మెన్ గంగాధర్, సర్పంచ్ సురేష్, ఏవో రాజు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో ఎంతో ప్రయోజనం


బురుగుపల్లిలో పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్

పెద్దకొడప్‌గల్: కంటి సమస్యలు ఉన్నవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నోడల్ ఆఫీసర్ శివకుమార్ సూచించారు. బుధవారం బురుగుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు.

భిక్కనూరు: కంటి చూపు ఇబ్బందులున్న వారికి కంటి వెలుగు పథకం ద్వారా ఎంతో ప్రయోజనం పొందవచ్చని ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన భిక్కనూరులో ఉన్న కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, ఉపసర్పంచ్ బోడ నరేషు, శ్రీసిద్ధరామేశ్వరాలయం పునర్‌నిర్మాణకమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, ఈవో సదాశివులు తదితరులు ఉన్నారు.

లింగంపేట: మండలంలోని భవానిపేట, బాణాపూర్ తండా, లింగంపేట గ్రామాల్లో బుధవారం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 452 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హిమబిందు తెలిపారు.

వైర్లు తెగి విద్యుత్ అంతరాయం



దోమకొండ: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ప్రాంతంలో బుధవారం సాయంత్రం 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడి, విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దోమకొండ సబ్‌స్టేషన్ నుంచి గొట్టిముక్కుల గ్రామానికి వెళ్లే విద్యుత్ వైర్లు లింగుపల్లి రోడ్డు సమీపంలో తెగిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. వెంటనే స్పందించిన ట్రాన్స్‌కో ఏడీ కిరణ్‌చైతన్య, ఏఈ ప్రదీప్‌కుమార్ సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి విద్యుత్‌ను పునరుద్దరించారు.

మొక్కలు విరివిగా నాటాలి


నెమ్లిలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్, ఏఎస్సై అబిద్ బేగ్ పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ సూచించారు. బుధవారం మండలంలోని బోర్లం క్యాంపులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ నాన్కుపీర్యానాయక్, ఉప సర్పంచ్ సాయిలు, ఎంపీటీసీ యశోద రతన్, డాక్టర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు నిరంతరం నీరు అందించాలి

నాగిరెడ్డిపేట: నర్సరీల్లో ఉన్న మొక్కలకు నిరంతరం నీరు అందించాలని ఎంపీడీవో రఘు సూచించారు. మండలంలోని రాఘవపల్లి, లింగంపల్లి, గోలిలింగాల గ్రామాలలో నర్సరీలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు వనజ, క్రిష్ణమూర్తి, మహేష్‌గౌడ్ తదితరులున్నారు.

బాలికలకు సుకన్య సమృద్ధితో భరోసా


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పోస్టల్ అధికారులు

బాన్సువాడ టౌన్: బాలికల భవితకు సుకన్య సమృద్ధి ఖాతా భరోసానిస్తుందని బోధన్ డివిజన్ తపాల శాఖ ఇన్‌స్పెక్టర్ వేణు అన్నారు. బుధవారం బాన్సువాడ పోస్టాఫీసులో సుకన్య సంవృద్ధి యోజన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవం నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా తపాలా శాఖ స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలతో ఈ నెల 9, 10వ తేదీల్లో ఫిలాటలీ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తుందని చెప్పారు. 75 లక్షల సుకన్య ఖాతాలను ఓపెన్ చేయాలని భారత ప్రభుత్వం నిర్దేశించిందని వెల్లడించారు. ఈపీఎం కృష్ణచైతన్య, మెయిల్ ఓవర్సీస్ రూపేష్, తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాచారెడ్డి: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహ సంబంధాలు పెరుగుతాయని మాచారెడ్డి జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి అన్నారు. స్పోర్ట్స్‌డే సందర్భంగా బుధవారం మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి పాలైనా క్రీడాకారులు నిరుత్సాహానికి లోనుకావొద్దని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజు, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పగడాల బాలచంద్రం, చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని ఫిజియోథెరపి వైద్యులు అరుణ్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం ఉన్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి రోజు ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలు చేయాలని సూచించారు. భవిత కార్యాలయం సిబ్బంది వెంకటేశం, శివకుమార్‌లు ఉన్నారు.



కాంగ్రెస్‌తోనే సామాన్యులకు న్యాయం



గాంధారి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని ఎల్లారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. హథ్ సే హథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని చద్మల్ తండా, చద్మల్, నౌసిరం తండా, దుబ్బ తండా, నేరల్, నాగ్లూర్, నాగ్లూర్ తండా, నెరల్ తండా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయిన ఎమ్మెల్యే సురేందర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు కామెల్లి బాల్‌రాజు, లైని రమేష్, మదార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే ప్రజల మద్దతు



మద్నూర్(జుక్కల్): దేశం, రాష్ట్రం బాగు పడాలంటే బీజేపీకే ప్రజలు మద్దతు తెలపాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్వాడీ, రథ్‌గల్లీ, గాంధీచౌక్‌లో బుధవారం ఆమె గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపే చూస్తున్నాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ముందుచూపుతో అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాష్ట్రంలో మాత్రంలో మాత్రం బీఆర్ఎస్ పార్టీ కుటుంబ పాలనతో ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. మండల అధ్యక్షుడు హన్మండ్లు, కార్యదర్శి చాట్ల హన్మండ్లు, నాయకులు కృష్ణపటేల్, యాదవ్‌రావ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు

దోమకొండ: మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద బుధవారం వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి నిల్చుని అవస్థలు పడ్డారు. వేలిముద్రలు రాని వృద్ధులు, దివ్యాంగులకు గ్రామ పంచాయితీ జూనియర్ అసిస్టెంట్ వేలిముద్రల ద్వారా పింఛన్ అందజేశారు. కాగా ఫించన్ కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు గంటల తరబడి పోస్టాఫీస్ కార్యాలయం వద్ద వేచి ఉన్నారు. దీనికి తోడు కేవలం ఇద్దరు మాత్రమే డబ్బులు పంపిణీ చేయడంతో చాలా సేపు వేచి చూడాల్సి వచ్చింది. ఒక్కొక్కరికి ఫించన్ డబ్బులు ఇవ్వడానికి అరగంట సమయం పట్టిందని, సిగ్నల్ రాక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కిష్టయ్య తెలిపారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

నస్రుల్లాబాద్(బీర్కూర్):బీర్కూర్ మండలంలో నివీరాపూర్ గ్రామంలో అంగన్‌వాడి భవన నిర్మాణానికి సర్పంచ్ సాయిరాం బుధవారం భూమి పూజ చేశారు.ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన రూ.9లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

ఉచిత వైద్య శిబిరం

దోమకొండ: మండల కేంద్రంలోని దేవేందర్‌రావ్ ఆస్పత్రిలో బుధవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ శశి కే శ్రీవాత్సవ్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ దేవేందర్‌తో పాటు సిబ్బంది అనిల్, శ్రీనివాస్, దేవేందర్, రవి, రత్నాకర్, సరిత, భారతి, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ పాల్గొన్నారు.

దుకాణాల కోసం వేలం వేయాలి

మద్నూర్: గ్రామ పంచాయతీ దుకాణాలను బహిరంగా వేలం వేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ నాయకుడు నగేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ చంద్రకాంత్‌కు వినతి పత్రం అందించారు.

బాల్య వివాహాలు వద్దు

రాజంపేట: బాల్య వివాహాలు చేయకూడదని తహసీల్దార్ శాంతి ప్రజలకు సూచించారు. బుధవారం ఆమె మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో బాల్య వివాహం చేస్తున్నారన్న సమాచారంతో అధికారుల బృందం అక్కడికి వెళ్లి బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మైనర్‌కు పెళ్లి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్‌లో ఉన్న జ్యోతి బాపులే పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డాక్టర్ శ్రీలేఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

నాగిరెడ్డిపేట: బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఈనెల 15న అధికారికంగా సెలవు ప్రకటించాలని లంబాడిల ఐక్యవేదిక గిరిజన నాయకులు డిప్యూటీ తహసీల్దార్ రాందాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. లంబాడిల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి రాములు నాయక్, మండల ఇన్‌చార్జి నరేష్ పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన ఆటో యూనియన్ నాయకులు

కామారెడ్డి అర్బన్: భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో యూనియన్ నాయకులు బుధవారం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కామారెడ్డి డీఎస్పీ సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు డీఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింలు, కృష్ణ, సత్యనారాయణ, బాలస్వామి, సిద్దిరాములు, లింగం, మహేందర్, భూమేష్, సాయిలు, సంతోష్, నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలు

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం పంచాయతీ సిబ్బంది ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు చేశారు. సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

భిక్కనూరు: మండల కేంద్రంలోని రేణుకా దేవి ఎల్లమ్మ ఆలయ 47 వ వార్షికోత్సవ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

శివస్వామి మెట్లపూజ

సదాశివనగర్: మండలంలోని ఉత్తునూర్‌లో శివస్వామి దీక్షాపరులు స్వామివారి మెట్లపూజ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శివనామ సంకీర్తనతో మారుమోగింది.